సాంకేతిక లోపంతో నిలిచిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - మండపేట



స్థానిక తాపేశ్వరం రోడ్డులోని బైపాస్ వంతెన సమీపంలో రాజమహేంద్రవరం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సాంకేతిక లోపంతో సోమవారం ఉదయం నిలిచిపోయింది. రాజమహేంద్రవరం నుంచి మండపేట మీదుగా రామచంద్రపురం, కోటిపల్లి వెళుతున్న ఈ బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించారు.

సాగునీటి కోసం సిపిఎం ధర్నా

శివారు భూములకు తక్షణమే నీరందించాలని డిమాండ్

పాల్గొన్న రైతు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం

శివారు భూములకు సాగునీరు అందించాలంటూ సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఫిబ్రవరిలోనే సాగునీటి కొరత వచ్చిందంటే ఏప్రిల్ నెలలో అసలు నీరందటే పరిస్థితి ఉండదన్నారు. ఈ నేపథ్యంలో శివారు భూములకు తక్షణం సాగునీరం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సాగునీరందించడంలో ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం తీవ్రంగా కనబడుతుందన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అక్రమ ఆక్వా చెరువులు పెరిగిపోయాయని, వీటి వ్యర్థాలను పంట కాలువల్లోకి వదిలేయడంతో డ్రెయిన్‌లు పూడుకుపోతున్నాయన్నారు. దీని వల్ల పొలాలకు నీరు అందడం లేదన్నారు. వెంటనే అక్రమ ఆక్వా చెరువులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కోనసీమ జిల్లాలో ఇరిగేషన్ కాలువలు, డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. స్లూయిజ్‌ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సాగునీరందక రైతులు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఏప్రిల్ మొదటి వారం వరకు తక్షణం నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీలేరు, ఇతర రాష్ట్రాల నుంచి సాగునీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల నీటినంతటిని సముద్ర జలాల్లో కలిపేశారన్నారు. గోదావరిలో నీటి ప్రవాహం లేకపోవడంతో ఇసుక మాఫీయా ఇసుకను తరలించేస్తుందన్నారు. దీన్ని బట్టి చూస్తుంటే ఇసుక మాఫియాతో ఇరిగేషన్ అధికారులు చేతులు కలిపేశారేమో అనే అనుమానం వస్తుందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, కోనసీమ రైతు పరిరక్షణ సమితి అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మానందం, అయితాబత్తుల ఉమామహేశ్వరం మాట్లాడారు. ఏప్రిల్ 15 నాటికి నీటి సరఫరాను నిలిపేసి మే 15న విడుదల చేయడం వల్ల సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించొచ్చన్నారు. అల్లవరం మండలంలో ఒఎన్‌జిసికి 365 రోజులు లిఫ్ట్ ద్వారా నీటిని తరలిస్తున్నారన్నారు. ఫలితంగా అక్కడ సాగునీటి ఎద్దడి తలెత్తిందన్నారు. ఆక్వా చెరువులకూ ఇంజన్లు ద్వారా కాలువల్లో నీటిని తోడేస్తున్నారన్నారు. వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. సాగునీటిని అందించకపోతే మరో పదిరోజుల్లో పి.గన్నవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన వరిపంట పూర్తిగా నాశనమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జి.దుర్గాప్రసాద్, పి.వసంత్‌కుమార్, కె.కృష్ణవేణి, కౌలు రైతు సంఘం, రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం, కోనసీమ రైతు పరిరక్షణ సమితి నాయకులు సఖిలే సూర్యనారాయణ, కుడుపూడి రాఘవమ్మ, సూర్యప్రకాశరావు, పాము బాలయ్య, అప్పారి వెంకటేశ్వరరావు, ఎన్.వెంకటేష్, బి.వెంకట్రావు, సిద్ధార్థ కుమార్, పి.తులసిరావు, పుల్లయ్య కాపు తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన మండలాల నుండి రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



సాగునీటి కోసం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రాన్ని అందుకుంటున్న కుడిపూడి సూర్యనారాయణరావు

ఎంఎల్‌సిగా కుడుపూడి ఏకగ్రీవం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల నియోజక వర్గ ఎంఎల్‌సిగా కుడుపూడి సూర్యనారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకురిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ సోమవారం అధికారికంగా ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. గడువు ముగిసే సమయానికి వైసిపి అభ్యర్థిగా కుడుపూడి మాత్రమే నామినేషన్ వేశారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఎంఎల్‌సి ఎన్నికైన కుడుపూడి సూర్య నారాయణరావుకు కాకినాడ, రాజమహేంద్రవరం ఎంపిలు వంగా గీత, మార్గాని భరత్ రామ్, కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. ఎంపీ మార్గాని భరత్ శాలువాతో సత్కరించారు. ఎంఎల్‌సి సూర్యనారాయణరావు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయనకు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

స్పందనకు ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొన్నారు. 213 అర్జీలను జెసి ధ్యానచంద్ర, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబులతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే స్పందనకు వచ్చే అర్జీలను ఆయా స్థాయిల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాలకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే స్పందనలో మండల స్థాయి సమస్యలు వచ్చిన వెంటనే వీడియో కాన్ఫరెన్స్ మోనటరింగ్ ద్వారా సంబంధిత అధికారులతో సంప్రదించాలన్నారు. అర్జీదారులు ముంగిటే వారితో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం పలానా అర్జీదారుడు మీ కార్యాలయానికి వస్తారని ఆదేశాలివ్వాలన్నారు. ఎవరి స్థాయిలో వారు సమస్యలు పరిష్కరిస్తే అర్జీదారులు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించే విధంగా జిల్లా యంత్రాంగం నూతన మోనిటరింగ్ ఒరవడిని తీసుకొచ్చిందన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు తమ లాగిన్ వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదికను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అధికారుల సమన్వయంతో జాయింట్ తనిఖీలు నిర్వహించాలన్నారు. అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ నివేదికను రూపొందించి ఆన్‌లైన్లఓ అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా అధికారులు పర్యటించే సమయంలో సచివాలయాలను సందర్శించి శాఖల పరంగా అందిస్తున్న సేవలను పరిశీలించాలన్నారు. అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ముద్రించిన గోడప త్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి ఎస్ఇలు సిహెచ్‌వి.కృష్ణారెడ్డి, చంటిబాబు, బి రాము, డిసిహెచ్ఎస్ పద్మశ్రీరాణి డిపిఒ వి.కృష్ణకుమారి, వివిధ శాఖల పీడీలు, జెడిలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా



ఇజ్రాయిల్‌తో దళిత సంఘాల నాయకులు, దళితులు

బొమ్మును కలిసిన దళిత నాయకులు

మండపేట : బొమ్ము ఇజ్రాయిల్‌కు ఎంఎల్‌సి కేటాయింపు పట్ల దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండపేట నుంచి ర్యాలీగా అమలాపురం వెళ్లి బొమ్మును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మాదిగలను గుర్తించిన ఏకైక నాయకుడిగా చరిత్ర సష్టించారన్నారు. 2024లో వైసిపిని గెలుపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, నాయకులు ఎం.సంజీవరావు, ఎం.సుధాకర్, కె.భాస్కరరావు, ఎం.ఆనందరావు పాల్గొన్నారు.

సాయిరామ్‌లో ఉత్సాహంగా విజ్ఞాన ప్రదర్శన

ప్రజాశక్తి-ఐ పోలవరం

గుత్తెనదీవి పంచాయతీ పరిధిలోని సాయిరామ్ విద్యానికేతన్‌లో సోమవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ఇంటర్నేషనల్ కరిక్యులం అయిన లీడ్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మంది విద్యార్థులు పాల్గొని సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్టూడెంట్ లెడ్ కాన్ఫెరెన్స్‌కు సంబంధించి 50 మంది విద్యార్థులు సెమినార్‌లో పాల్గొన్నారు. వారు నేర్చుకొన్న విషయాలను వివరించారు. ఈ సందర్భంగా సాయిరాం విద్యానికేతన్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాల వెలికితీతకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో లీడ్ స్కూల్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ మోహన్ మాట్లాడారు. లీడ్ స్కూల్‌లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో పాఠ్యాంశాలు ఉంటాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరేందుకు, మంచిఉద్యోగాలు సంపాదించే వీలుంటుందన్నారు. అన్ని క్లాస్ రూమ్స్‌లో స్మార్ట్ టీవీ, ట్యాబ్‌తో అనుసంధానం చేయబడి విద్యాబోధన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాగాపు సీతారత్నం, ఉపాధ్యాయులు ఎన్.ధనరాజు, బి.నాగేంద్రవర్మ, లీడ్ స్కూల్ అకాడమిక్ ఎక్స్‌లెన్స్ మేనేజర్ లక్ష్మణ్ వారణాసి, మోహన్ పాల్గొన్నారు.

రామచంద్రపురంలో భారీ చోరీ

2.50 లక్షల నగదు. 32 కాసుల బంగారం ఆపహరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలోని బ్రాడీపేట అఫీషియల్ కాలనీలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పిసిని వీరబాబు తల్లి ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఆమెను వైద్యం కోసం ఆదివారం కాకినాడ తీసుకెళ్లారు. ఇంటికి తాళం వేసి అందరూ కాకినాడ వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియన వ్యక్తులు ఇంట్లో చొరబడి 32 కాసుల బంగారం, 500 గ్రాములు వెండి, రూ.2.50 లక్షల నగదును చోరీ చేశారు. ఈ మేరకు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తుంది. రామచంద్రపురం సిఐ దుర్గారావు, ఎస్ఐ సురేష్‌బాబు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - మండపేట

పార్టీ బలోపేతానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే వారధులని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. సోమవారం స్థానిక ధర్మం చెరువు వద్ద ఉన్న ఫంక్షన్ హాల్లో పట్టణ జెసిఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు అధ్యక్షతన 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఎంఎల్‌సి తోట, మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి, వైసిపి రైతు కిసాన్ సెల్ కార్యదర్శి రెడ్డి రాజబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.


తూరల పనులను పూర్తి చేయాలి

కపిలేశ్వరపురం : కోరిమిల్లిలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలోని మైనర్ డ్రెయిన్‌కు ఏర్పాటు చేస్తున్న తూరల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆదేశించారు. ఈ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేసవికి పూర్తి చేయాలన్నారు.

పిటిఐల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

జిల్లా ఆర్ట్ వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్ టైం కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్ల సమావేశం పిటిఐ జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షులు సాదా రామకృష్ణ అధ్యక్షతన సోమవారం అమలాపురం యుటిఎఫ్ హోమ్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుంట్రు సత్యనారాయణ, అధ్యక్షులుగా పోలిశెట్టి నరసింహాచంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా ఆత్కూరి శారదాకృష్ణ, జనరల్ సెక్రటరీగా మోరంపూడి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా జనుపల్లి అశోక్‌బాబు, సహాయ కార్యదర్శిగా పట్నాల రామవెంకటప్రకాశరావు, సహాయ కార్యదర్శిగా వలవల దుర్గాభవాని, మహిళా సభ్యులు సవరపు స్వర్ణశ్రీదేవి, సహాయ కార్యదర్శి దొండపాటి లక్ష్మీనారాయణ, పి.రాజేశ్వరి, కమిటీ గౌరవ సలహాదారులు నయనాల రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు.



ఘనంగా స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని విలసలో మన్నా మినిస్ట్రీస్ కుష్టు రోగుల పునరావాస కేంద్రంలో ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం(వరల్డ్ ఎన్‌జిఒ డే)ను జిఎంసి బాలయోగి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంగుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అన్నా మినిస్ట్రీస్ అధినేత రిటైర్డ్ ఎంపిడిఒ ఐఇ.కుమార్ హాజరయ్యారు. తొలుత ఎర్నెస్ట్ కుమానపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అన్నదానం, వస్త్ర దానం చేశారు. రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. నాలుగు దశాబ్దాలుగా న్యూ లైఫ్ సెంటర్లో డాక్టర్‌గా పనిచేస్తున్న ప్రసాద్, కాంపౌండర్ షేక్ మీరాసాహెబ్, వీరవల్లిపాలేనికి చెందిన ముద్రగడ నాగయ్య సత్రం ప్రతినిధి ముద్రగడ సుబ్బారావు, తొత్తరమూడి గ్రామం క్షణ ముక్తేశ్వర దేవాంగ అన్నదాన సత్రం ప్రతినిధి అంకం వీర్రాజులను ఘనంగా సత్కరించి అవార్డును అందించారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కరోనా సమయంలో తమ ఇంటిని క్వారంటైన్‌గా తీర్చిదిద్ది రోగులకు సేవలందించడమే కాకుండా కరోనా వల్ల చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించిన జడ్‌పిటిసి మాజా సభ్యులు గంగుమళ్ల కాశీ అన్నపూర్ణా, శ్రీనివాస్ దంపతులు సేవలు అనిర్వచనీయమైనవన్నారు. ఈ సేవా కార్యక్రమంలో పాస్టర్ డేవిడ్, టిడిపి సీనియర్ నాయకులు కముజు విజయభాస్కరరావు, చారిటబుల్ సొసైటీ అయినవిల్లి మండల కన్వీనర్ అక్కిశెట్టి దుర్గారావు, ఎన్.రాజేష్ కుమార్, ఎస్తేరు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్, సిబ్బందిని సత్కరిస్తున్న బాలయోగి ఛారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకులు

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

ప్రజాశక్తి - ఆలమూరు, ఉప్పలగుప్తం

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల సమక్షంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ కె.జాన్‌లింకన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్పందనకు ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయన్నారు. ప్రజల నుంచి ఏదైనా సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే యంత్రాంగం సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ రామ స్వరూప్, ఇఒపిఆర్‌డి రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ పోచమ్మ, హౌసింగ్ ఎఇ డి.శ్రీనివాస్, ఎపిఎం ధనరాజు, ఎపిఒ ప్రసాద్, డిటి జానకిరామయ్య, విఎఎస్.వినోద్‌కుమార్, ఇఒ ఎంఎస్ఆర్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి సోమవారం మండల స్థాయిలో స్పందన కార్యక్రమం జరుగుతుందని తహశీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. తొలి రోజు రెండు అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెఎస్.గౌరీకుమారి, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్ ఎఇలు వి.రాధాకృష్ణ, కె.సురేష్, శ్రీహరి, ఎపిఒ వి.రాజామణి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి

ఆలమూరు : వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని పలుచోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాలన్నారు. అలాగే కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదన్నారు. నిబంధనలు పాటించిన పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు. దస్త్రాలు లేని వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రామచంద్రరావు, హెచ్‌సి చిట్టిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మండపేట : మండలంలోని తాపేశ్వరం-ద్వారపూడి రోడ్డు అభివద్ధి పనుల్లో భాగంగా చెట్లు తొలగింపు నేపథ్యంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులకు సేవలందించాలి

మామిడికుదురు : రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ నక్కా కృష్ణవేణి అధ్యక్షతన సోమవారం జరిగిన మొదటి సాధారణ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి వాటి పరిష్కారానికి పాలకవర్గం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, సభ్యులు కె.హేమసుందరరావు, ఎ.అనంతలక్ష్మి, సిహెచ్.నాగలక్ష్మి, పాసర్లపూడి పిఎసిఎస్ అధ్యక్షులు యువివి.సత్యనారాయణ, కార్యదర్శి జి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మామిడికుదురు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులందరికీ సాయం అందించేందుకు గృహసారథులు, కన్వీనర్లు కృషి చేయాలని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. జెసిఎస్ మండల కన్వీనర్ జక్కంపూడి వాసు అధ్యక్షతన సోమవారం పెదపట్నం లంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, పాశర్లపూడిలో గృహ సారథులు కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. గృహ సారథులకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శివరామ సుబ్రహ్మణ్యం, గెడ్డం మంగా లక్ష్మి, నాయకులు కొమ్ముల రాము, గోపాలకృష్ణ, డి.దుర్గారావు, నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కేశనకుర్రు ఆర్‌బికె వద్ద ప్రకృతి వ్యవసాయ నవధాన్యాలు సాగుపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ బీర సత్యకుమారి సమక్షంలో రేవు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైస్ ఎంపిపి పిన్నమరాజు సత్యనారాయణరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సేంద్రియ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. పిఎండిఎస్ కిట్స్ తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం నవ ధాన్యాలు విశిష్టతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ హేమలత, మురళి, మధు, లక్ష్మణ్, విఎఎ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - రామచంద్రపురం, మండపేట

స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా పలువురు ఘనంగా నివాళులర్పించారు. రామచంద్రపురం బిసి కళాశాల హాస్టల్‌లో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి. సిద్ధూ మాట్లాడారు. చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.నవీన్‌కుమార్, బి.మధు, ఒ.ఆదిత్య, ఎం.శ్యాంప్రసాద్, టి.తరుణ్, వీరేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. మండపేట సంగమేశ్వర కాలనీలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం చిట్టూరి వెంకటశ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని ధర్నాకు వెళ్లిన నాయకులు, కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, ప్రజాస్వామ్య వాదులు ఈ అరెస్టులను ఖండించాలని సిపిఎం నాయకులు నూకల బలరామ్ అన్నారు. ఫ్యాక్టరీల్లో కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు.

విద్యా హక్కు చట్టానికి సర్కారు తూట్లు

ముమ్మిడివరం : విద్యా హక్కు చట్టానికి వైసిపి సర్కారు తూట్లు పొడుస్తుందని ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీకురుమల శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగం ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలకు వచ్చే స్కాలర్‌షిప్ విధానాన్ని ప్రభుత్వ రద్దు చేసి అన్యాయం చేసిందన్నారు. అమ్మ ఒడి పథకం పెట్టి స్కాలర్‌షిప్ సొమ్మును ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సిన ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులందరికీ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలో ఉచిత విద్యను అందించాలని, విద్యా హక్కు చట్టాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపడుతామన్నారు. అమ్మ ఒడి పథకం నుంచి ఫీజు కట్టాలనే ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. లేకుంటే దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

మండపేట : మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని ఎస్ఐలు అశోక్, అప్పారావు తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం స్థానిక ఆలమూరు రోడ్డులోని ఆదిత్య జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లకు, లైసెన్సులు లేని వారికి వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వరాదన్నారు. మైనర్ వాహనం నడుపుతుండగా ప్రమాదం సంభవిస్తే వాహనం ఇచ్చిన యజమాని, తల్లిదండ్రులు, సంరక్షకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మండపేట : మండలంలోని అర్తమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కర్రి బాపిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, తాడి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో వాలంటీర్ అరెస్ట్

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక కాయగూరల మార్కెట్లోని కొట్టులో చోరీకి పాల్పడిన రెండవ వార్డ్ సచివాలయం వాలంటీర్ డి.అయ్యప్ప స్వామిని అరెస్ట్ చేసినట్లు సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మిరప కాయల వీధికి చెందిన ఎ శ్రీను కాయగూరల మార్కెట్లోని దారాలమ్మ మసాల కొట్టు నిర్వహిస్తున్నాడని రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణం మూసివేసి గురువారం ఉదయం తెరిచి చూడగా షాపులోని గది వెనుక షట్టరు తెరిచి ఉన్నట్టు గుర్తించాడు. లోపల గల్లా పెట్టెలో ఉంచిన రూ.2.40 లక్షల నగదు, ఇతర సామాన్లు చోరీకి గురైనట్టు గుర్తించి పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణ అనంతరం చోరీకి పాల్పడిన అయ్యప్ప స్వామిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2,40 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సిఐ తెలిపారు.

జగ్గంపేటలో గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండల రామవరం వద్ద అనకాపల్లి నుంచి తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న లారీని జగ్గంపేట పోలీసులు ఆదివారం పట్టు కున్నారు. దీనికి సంబంధించి జగ్గంపేట సిఐ సూరి అప్పారావు సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలి పారు. జగ్గంపేట పోలీసులకు అందిన సమాచారం మేరకు కిర్లంపూడి టోల్ ప్లాజా దాడి వస్తున్న గంజాయి లోడుతో తమిళనాడు యజమాని గౌతమ్‌కు చెందిన లారీని, డ్రైవర్ ఆర్ తంగైని స్థానిక హర్యానా డాబా వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బస్తాలలో ఉన్న 321 కేజీల గంజాయిని, డ్రైవర్ దగ్గర ఉన్న సెల్ ఫోన్, రూ.రెండు వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనకాపల్లి నుంచి తమిళనాడుకు పంపిస్తున్న సప్లైదారుడు అలాగే తమిళనాడులో విక్రయిస్తున్న గౌతమ్ త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

అదుపు తప్పి క్వారీ లారీ బోల్తా

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని శంగవరం గ్రామ శివారున సోమవారం రౌతులపూడి ప్రాంతం నుంచి కత్తిపూడి వైపు బూడిద లోడుతో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న వాహ నాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. రహదారి అధ్వానంగా ఉండటం, దీనికి తోడు అధిక లోడుతో లారీ ప్రయాణమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలుపుతున్నారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం, గండేపల్లి

మండలంలోని జె అన్నవరం గ్రామం శివారు అటవీ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడి చేసి, భారీ స్థాయిలో బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. ఐదు లీటర్ల సారాతో వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. గండేపల్లి మండలం సింగరాయపాలెం శివారులో సారా బట్టీపై సోమవారం దాడిచేసి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఓ వ్యక్తిని అదుపులో తీసుకున్నట్టు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు. అతని వద్ద నుండి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు

పేకాటాడుతున్న ఏడుగురి అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

నీలాద్రిరావు పేట గ్రామ శివారున డాబా ఇంటిలో పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నటుట గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు. వీరిని మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేసి, వారి వద్ద నుండి లక్షా 40 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గోకవరం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన గోకవరంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట గ్రామానికి చెందిన అన్నా చెల్లెళ్లు గంటా సత్తిబాబు, జక్కల అమ్మాజీ పెళ్లి కబుర్లు చెప్పడానికి మండలంలోని తిరుమలాయపాలెం వెళ్లారు. తిరిగి బైక్‌పై వస్తుండగా రంపయర్రంపాలెం మార్గంలో కారు బైకును వెనక నుంచి ఢీకొనడంతో సత్తిబాబు, అమ్మాజీకి తీవ్ర గాయాలయ్యాయి. వారిని తక్షణమే ఆదే కారులో గోకవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం బాధితులను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

గడ్డి మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

మానసిక పరిస్థితి బాగోలేక గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎఎస్ఐ శోభనాద్రి తెలిపారు. నందిగూడెం గ్రామానికి చెందిన బొల్లారెడ్డి పవన్ కళ్యాణ్ (23)కు కొంతకాలంగా మానసిక పరిస్థితి బాలేదు. శనివారం గడ్డి మందు తాగాడు. రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మతి చెందాడు. తండ్రి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపురం ఎఎస్ఐ శోభనాద్రి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చందనను కలిసిన పోసికుమార్

ప్రజాశక్తి - ధవళేశ్వరం

వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులైన ముత్యాల పోసికుమార్ వైసిపి రాజమండ్రి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను సోమవారం మర్యాదక పూర్వకంగా కలిశారు. రూరల్ నియోజకవర్గం నుండి పోసి కుమార్ ఎన్నిక కావడం సంతోషముగా ఉందని చందన తెలిపారు. వికలాంగులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, రూరల్ నియోజకవర్గంలో ఏ అవసరం వున్నా తన దృష్టికి తీసుకు వస్తే తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని చందన తెలిపారు. పోసికుమార్‌తో పాటు సబ్బెళ్ల విజయదుర్గ రెడ్డి, మత్సేటి శివ, గోలి దేవకుమార్, తలారి ప్రసాద్, రజనీకుమార్, సాగర్, పుష్కర్, బి.దుర్గ, పి.సత్యవేణి, ఆర్.సత్యవేణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వినియగదారుల సదస్సులో మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

వినియోగదారుల చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారుల చట్టంపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తమ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం కొండయ్యపేటలోని 8,11 వార్డుల సచివాలయంలో సచివాలయాల సిబ్బంది, వాలం టీర్లకు వినియోగదారుల చట్టం-2019 పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు.ఆయన మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులలో కల్తీలు, మోసాలు, నాణ్యత లోపాలు, డూప్లికేట్, ఎక్స్పైరీ డేట్ ఉన్న వస్తువులు, కొలతలు తేడాలు ఉంటే వెంటనే వినియోగదారుల కమిషన్కు ఫిర్యాదు చేయాలన్నారు.మోసానికి గురైన వినియోగదారులకు ఈ కమిషన్ ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. సచివాలయం కార్యదర్శి బి ప్రకాష్, వినియోగదారుల సంఘం కార్యదర్శి ఎం భాస్కరరావు, సభ్యులు కేవీవి లక్ష్మి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందిస్తున్న పిఠాపురం ఫైర్ ఆఫీసర్ వేణు

యువతకు సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

యువత, మహిళల సాధికారత కోసం, అరబిందో ఫార్మా ఫౌండేషన్ కాకినాడ సెజ్ ప్రాంతంలో నిర్వహిస్తున్న, మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రం, ప్రతిభ కేంద్రాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 55 మంది యువతకు పిఠాపురం ఫైర్ ఆఫీసర్ ఏవిఎస్ఎన్ ఎస్ వేణు సోమవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మహిళా నైపుణ్య అభివృద్ధి కేంద్రం ద్వారా మహిళలకు తగిన నైపుణ్యాన్ని అందించే అంశాలలో శిక్షణ ఇస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ సేవలను వేణు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకర్ గణేష్, మెడికల్ ఆఫీసర్, అరబిందో ఆరోగ్య కేంద్రం, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో ఈ క్రాఫ్ పూర్తిస్థాయిలో నమోదు చేసుకోవడానికి రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఎఒ సద్గురు మూర్తి తెలిపారు గండేపల్లి మండలంలో రబీ-2022-23 సీజన్కుగాను 5824 ఎకరాలు గాను 2455 రైతులకుగాను ప్రస్తుతానికి 5246 ఎకరాలు గాను 2123 రైతులకు ఈ-కేవైసీ పూర్తయినట్టు తెలిపారు. ఈనెల 28 వ తేది చివరి రోజు అని కావున రైతులందరూ మండలంలోని సంబంధిత సచివాలయం రైతు భరోసా కేంద్రం లో నమోదు పూర్తి చేసుకోవడానికి సంప్రదించాలని ఏవో తెలియజేశారు.

క్వారీ కార్మికుల పొట్ట కొట్టొద్దు

ధర్నా చౌక్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ ధర్నా చౌక్ వద్ద సోమవారం ప్రతిపాడు మండలం జనసంకర్లపూడి గ్రామ ప్రజలు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలివెల జనార్ధన్ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా 200 మంది కుటుంబాలు నల్ల క్వారీ కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నా రన్నారు. కొంతమంది వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం లారీలను ఆపుతూ, క్వారీ యాజమాన్యంపై దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ యాజమాన్యంపై ఒత్తిడి పెంచి డబ్బులు డిమాండ్ చేస్తున్న దళారీ వ్యవస్థను నియంత్రించి, కార్మికుల పొట్ట కొట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

గోకవరంలో తంటికొండ వెళ్లే రహదారిని అనుకుని ఉన్న క్రిస్టియన్ శ్మశాన వాటికలో చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులను సోమవారం పలువురు పరిశీలించారు. సచివాలయాలు కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి సుంకర వీరబాబు, ఎస్షి సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్, చింతల అనిల్ మాట్లాడుతూ రూ.5 లక్షలతో చేపట్టిన పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

బాలోత్సవాల్లో కడియం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడియం

25, 26న జరిగిన గోదావరి బాలోత్సవాల్లో కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు అంశాల్లో విజేతలుగా నిలిచారు. సీనియర్స్ విభాగంలో జానపద పాటలు ప్రథమ స్థానం, లఘు నాటికలో ద్వితీయం, జూనియర్ విభాగంలో జానపద పాటలు, ఏక పాత్రాభినయంలో ద్వితీయం, బెస్ట్ ఫ్రం వేస్ట్‌లో తతీయ స్థానాలు సాధించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థినీ పవిత్ర నటనను పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను, వారికి తర్ఫీదు నిచ్చిన గొల్లపల్లి సత్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో రఫీయుద్దీన్, పుష్ప కుమారి, డేవిడ్, నాగమణి, శరత్ పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ఆజాద్

ప్రజాశక్తి-తాళ్లపూడి


జీవితంలో ఏదో ఒక ఘనత సాధించాలనుకొన్న ప్రతి ఒక్కరూ స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జీవితాన్ని ఆశయంగా తీసుకోవాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. ఆజాద్ వర్ధంతి సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో సమరయోధుని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ సమరయోధుని జీవిత విశేషాలను పోరాటపటమను విద్యార్థులకు వివరించారు.

ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష

ప్రజాశక్తి- గోకవరం

స్థానిక మండల కార్యాలయంలో ఎంపిడిఒ కెవిఎస్ఎస్-ఎస్.మూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూళ్లలో ప్రతి పంచాయతీకి ఇచ్చిన టార్గెట్ ప్రకారం వసూలు చేయాలని, నూటికి నూరు శాతం వసూలు అవ్వాలని స్పష్టం చేశారు. ఇంటి పన్నుల విషయంలో పంచాయతీ సెక్రటరీలు సచివాలయం సిబ్బంది గ్రామ వాలంటీర్ల సహకారంతో పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను వెల్ఫేర్ అసిస్టెంట్లు మహిళ పోలీసులు సచివాలయం సిబ్బంది సహకారంతో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ

భగత్ సింగ్ అనుచరుడు, స్వాతంత్ర సమరయోధుడు, బ్రిటిష్ వారికి సింహ స్వప్నమైన కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతి నివాళులు సిఐటియు కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ బ్రిటిష్ దోపిడీకి వ్యతిరేకంగా సోషలిస్ట్ రిపబ్లికన్ పార్టీ సభ్యుడిగా, విప్లవకారుడిగా చంద్రశేఖర్ ఆజాద్ భగత్ సింగ్ అనుచరులలో ముఖ్యునిగా 24 ఏళ్ల వయసులో భారత దేశ స్వాతంత్రాన్ని కాంక్షిస్తూ బ్రిటిష్ వారు చేతిలో చనిపోవడం ఇష్టం లేక మిగిలిన ఆఖరి బుల్లెట్టుతో ఆత్మార్పణ చేసుకున్నారని తెలిపారు. నేడు స్వాతంత్రం సాధించి ఏళ్ళు గడుస్తున్న ఆజాద్ కలలు కలలుగానే పాలకులు మిగిల్చారని, భారత స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన ఎందరో వీరుల త్యాగాలను గుర్తు చేశారు .దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడమే చంద్రశేఖర్ ఆజాద్ కి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రవతి, కోశాధికారి రమణమ్మ, దాడి బేబీ, తలారి నాగమణి, మిరియాల రాజేశ్వరి, ధనలక్ష్మి, మేరీ సమాధానం, సిహెచ్. రమ, ఎంకే. జ్యోతి, టి.నీరజ, జి.రామలక్ష్మి, పి. నాగురా, త్రిఫ్ట్ సొసైటీ భాద్యులు చామంతి, బాలం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** శాఖ గ్రంథాలయంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలతో వేసి ఏ డి వి ప్రసాద్, కటకం కిరీటి బాబు, కె ప్రభాకర్ రావు ఉడతల రమణారావు బంటుపల్లి అప్పారావు గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ నివాళులర్పించారు.



డాక్టర్ మహోన్నతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

కెరీర్ గైడెన్స్ డే సందర్భంగా సోమవారం జిల్లాలో పలు పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులలో ప్రముఖులు, వక్తలు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై పలు సూచనలు చేశారు.

కాకినాడ : ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలని కెరీర్ గైడెన్స్ ఇన్‌ఛార్జ్ సిహెచ్ శ్రీహరిరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. కెరీర్ గైడెన్స్ డేను స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కెరీర్ గైడెన్స్ ఇన్‌చార్జ్ సి. హెచ్ శ్రీహరి రావు నాయుడు మాట్లాడుతు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవిఎస్ రామకృష్ణ, జి.శ్రీనివాస్, జి.సూరి బాబు, పి.కాంతభిలాషా, బి.సంపత్ కుమార్ పాల్గొన్నారు. **సామర్లకోట** బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్‌లో, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్, పాఠశాల కెరీర్ గైడెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా డాక్టర్ మహోన్నత్ విద్యార్థులకు కెరీర్‌పై పలు సూచనలు చేశారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ మహోన్నత్‌ను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాస రావు, స్పందన ఈదా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్. ఏ.మూర్తి, ఎక్జిక్యూటివ్ సభ్యులు టి.వి.వి సత్యనారాయణ, గైడ్ టీచర్ జి.గోవిందు, ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంతం,కే.అరుణ,ఏ.ఎల్.వి.కుమారి పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్ :** సామర్లకోట గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు యన్ కొండారెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. జ ముఖ్య అతిథులుగా నన్నయ యూనివర్సిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు ఎం సత్య నారాయణ, సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్, సామర్లకోట పిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ అమల తదితరులు విద్యార్థులకు కెరీర్‌పై పలు సూచించారు. కార్యక్రమంలో కెరియర్ గైడెన్స్ ఆఫీసర్స్ ఎం నారాయణరావు, బిఎస్ సంజీవరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం టీవీఎస్ రంగారావు పాల్గొన్నారు. **కరప** మండలం గురజనాపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.ఆర్.వి ప్రసాద రావు అధ్యక్షతన కెరీర్ గైడెన్స్‌పై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తలుగా పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు వి.శ్రీనివాసరావు విద్యార్థులతో ముఖాముఖి చర్చలు జరిపారు. పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల హెడ్ ఆఫ్ ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ పి.వి. కృష్ణారావు పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడంపై వివరించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వివి రమణమూర్తి, జి.అర్జునరావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉందని తెలియదా : కలెక్టర్ ఆగ్రహం

- నాలుగు గంటలకు పైగా ఎండలో వికలాంగుల ఎదురుచూపులు
- చెప్పకుండా వెళ్లిపోయిన ఎడి కామరాజు



వాహనాల ఇస్తారని ఎండలో ఎదురుచూస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ కలెక్టరేట్‌కు సోమవారం స్పందన కార్యక్రమం అనంతరం వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హత కలిగిన వికలాంగులకు వాహనాలు అందజేస్తున్నట్టు వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు లబ్దిదారులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు ఉదయం 9 గంటలకే జిల్లా నలుమూలల నుంచి వికలాంగులు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకుని ఎంతో ఆశగా ఎదురు చూశారు. ఏడి కామరాజు విషయాన్ని కలెక్టర్ కృతికా శుక్లాకు తెలుపగా, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ఇటువంటి కార్యక్రమాలు ఎందుకు చేస్తున్నారని కామరాజును ప్రశ్నించడంతో కామరాజు అక్కడ నుంచి వెళ్లిపోయినట్టు సమాచారం. అయితే మధ్యాహ్నం రెండు గంటల వరకు అభ్యర్థులను వాహనాల దగ్గరే కూర్చుని ఉండమనడంతో, కనీసం మంచినీరు కూడా ఇవ్వకుండా అభ్యర్థులను అలానే ఉంచేశారు. తీరా స్పందన కార్యక్రమం అయిపోయిన తర్వాత కలెక్టర్ వాహనాలు పంపిణీ నిర్వహించలేదు. ప్రతి మండలాల్లోనూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవాలని, మొత్తం ఒక్కసారే ఏర్పాటు చేసుకోకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలపడంతో కామరాజు స్పందన పూర్తయిన తర్వాత అభ్యర్థులకు కనిపించకుండా వెళ్లిపోయారు. కలెక్టర్ తమ పనిని సక్రమంగా నిర్వర్తించ్ఛినప్పటికీ కింది స్థాయి అధికారులు ఎన్నికల కోడ్ నిబం ధనను పాటించక, నిర్లక్ష్య వహించడంతో జిల్లా నలమూడి నుంచి వచ్చినన అభ్యర్థులు ఉదయం నుంచి సుమారు నాలుగు గంటలకు పైగా ఎంతో ఆసక్తిగా తమ వాహ నాలు వస్తాయని ఎదురుచూసి నిరాశతో వెలుగుతిరిగారు.

శ్మశానంలో వెలగని లైట్లు

ప్రజాశక్తి - యానాం

యానాం కురసాంపేటలోని హిందూ శ్మశానవాటికలో లైట్లు వెలగకపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా లైట్లు వెలగక పోవడంతో శ్మశానంలో అంధకారం నెలకొంది. రాత్రి సమయాల్లో దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బందిగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

ఘనంగా గజవాహనోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా 7వ రోజు సోమవారం రాత్రి గజవాహనోత్సవం ఘనంగా జరిగింది. గ్రంధి గణపతి కుమారులు ఉత్సవదారులుగా గజవాహనంపై ఉన్న స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలోఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్,ఆర్ ఏ ఓ మునిస్వామి, ఇన్చార్జి కమిషనర్ కె.రామకృష్ణ, పాల్గొన్నారు. .

తాడేపల్లి నుంచే వివేకా హత్యకు కుట్ర

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తాడేపల్లి ప్యాలెస్‌లోనే వివేకానందరెడ్డి హత్యకు పన్నాగం పన్నారని,హత్యలో సూత్రధారులను శిక్షించే రోజులు దగ్గర పడ్డాయని టిడిపి కాకినాడ సిటీ నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు విమర్శించారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైయస్ వివేకా నంద రెడ్డి హత్య ఘటనపై జగనాసుర రక్త చరిత్ర బహిరంగ బుక్‌లెట్‌లను టిడిపి నాయకులు ఆవిష్కం చారు. మల్లిపూడి వీరు మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారం కోసం తన సొంత బాబాయిని హత్య చేయించి గుండెపోటుగా చిత్రీకరించి, నారా చంద్రబాబు నాయుడే వైయస్ వివేకానంద రెడ్డిని హత్య చేయించాడని అసత్య ప్రచారం చేశారనీ, నేడు సిబిఐ విచారణలో గూగుల్ టేక్ అవుట్ ద్వారా వైయస్ వివేకానంద రెడ్డిని తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతోనే హత్య చేయించారని తేటతెల్లం అయ్యిందన్నారు. నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్ సొంత బాబాయిని హత్య చేసిన రక్త చరిత్ర వైసిపి పార్టీదని, వైసీపీ రక్త చరిత్రను ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో పలివెల రవి, గదుల సాయిబాబా, బంగారు సత్యనారాయణ, పైలా రామకష్ణ, ఒమ్మి బాలాజీ, మల్లాడి చిన్నా పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ రక్తదానం

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి సరస్వతి విద్యానికేతన్ అవవరణలో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వ ర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు 40 మంది యువకులు రక్తదానం అందజేశారని కాకినాడ కు చెందిన అక్షయ ఫౌండేషన్‌కు అందజే యనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని పి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ బి.చక్రవర్తి పిలుపునిచ్చారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగం సోమవారం స్థానిక జగన్నాథపురం ఎమ్.ఎస్.ఎన్ చారిటిస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నందు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా బి.చక్రవర్తి మాట్లడుతూ సైన్స్ లో పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. నేటి తరానికి ఆదర్శ ప్రాయుడు సర్ సి.వి రామన్ అన్నారు. రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతానికి మన దేశానికి నోబుల్ బహుమతి వచ్చిందన్నారు. విద్యార్థులు రూపొందించన సైన్స్ నమూనల ను తిలకించారు. కార్యక్రమంలో పి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు షెక్ మధీనా షాహెబ్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.మేరీ విజయ కుమారి పాల్గొన్నారు. విద్యార్థులకు మానవాళి కోసం జీవశాస్త్రం పాత్ర అనే విషయం పై వ్యాసరచన, వక్తత్వం పోటీలను నిర్వహించారు.



అబాకస్ లో అంతర్జాతీయ బహుమతులు పొందిన ఆదిత్య విద్యార్థులు

అబాకస్‌లో 'ఆదిత్య' విజయకేతనం

ప్రజాశక్తి - కాకినాడ

ఇటీవల స్మార్ట్‌జీనియస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి అబాకస్, వేదికా మ్యాథ్స్ పోటీలలో ఆదిత్య విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. 2022-23 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ అంతర్జాతీయ స్థాయి పోటీలలో వివిధ దేశాలకు చెందిన సుమారు పదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా వారిలో 1000 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో 413 మంది (41.3 శాతం విద్యార్థులు) ఆదిత్య పాఠశాలలకు చెందినవారే అని స్మార్ట్ జీనియస్ ఛైర్మన్ రాజ్యలక్ష్మి తెలియజేశారు. వీరంతా ఫిబ్రవరి 25వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథులు హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ సివి ఆనంద్, హైదరాబాద్ జె.యన్.టి.యు ఉపకులపతి కట్టా నరసింహారెడ్డి, ఎంఎల్‌సి సురభి వాణి దేవి, హైదరాబాద్ జేఎన్టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. మంజూర్ హుస్సేన్‌ల నుంచి బహుమతులు అందుకున్నారు. ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి విజేతలకు అభినందనలందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి విద్యార్థులను, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

ఉపాధ్యాయునిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - కాజులూరు

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయులు తోట నాగేశ్వర రావు పై చర్యలు తీసుకోవాలని పల్లిపాలెం జడ్పి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పల్లిపాలెం జడ్పి ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలస్యంగా రావడంతో పాటు విద్యార్థుల పట్ల నాగేశ్వరరావు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. దీనిపై హెచ్ఎం ప్రసాద రావుకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఆ ఉపాధ్యాయుని పాఠశాల కు విధులకు హాజరు కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంపీటీసీ మేడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ఎండియూ ఆపరేటర్స్ సంఘం అధ్యక్షునిగా సత్యానందం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం ఎండియూ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా రెండోసారి ఏకగ్రీ వంగా దర్శి పాటి సత్యా నందం ఎన్నిక య్యారు. ర్యద ర్శిగా తేజ నాయక్, ఉపాధ్యక్షునిగా బాల కృష్ణ, కోశాధికారిగా వీరవెంకటరమణలు ఎన్నిక య్యారు. సోమవారం తహశీల్దార్ లక్ష్మీనరస కుమారిని సత్యానందం ఆధ్వర్యంలో నూతన కమిటీ, ఎండియూ ఆపరేటర్లతో కలసి తమ సమస్యలను వివరించారు.



దర్శిపాటి సత్యానందం

ట్యాంక్ నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి ఎస్‌సి కాలనీకి మంచినీటి ట్యాంక్ మంజూరు చేయాలని ఎంపిడిఒ ఎం.గోవింద్ కు కాకినాడ జిల్లా మాల మహానాడు అధ్యక్షులు చిట్ట మూరు గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు పలుమార్లు కాలనీలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ అధికారులు స్పందించడం లేదని తెలిపారు. కాలనీకి మంచినీటి ట్యాంకు మంజూరు చేసి ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సి కాలనీ యువత పాల్గొన్నారు.